
సాక్షి బాపట్ల

గురువారం । 18 । జనవరి । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 520.90 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 826.80 అడుగుల వద్ద ఉంది.



దుర్గమ్మను దర్శించుకున్న జస్టిస్ వెంకటరమణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మను మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ డి. వెంకటరమణ బుధవారం దర్శించుకున్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి టౌన్ : గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌లో బుధవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ. 4వేలు, గరిష్ట ధర రూ. 4,800లు, మోడల్ ధర రూ. 4,400లు వరకు పలికింది.

న్యూస్‌రీల్

నగరపాలక సంస్థ సీఎంఓహెచ్‌గా డాక్టర్ ఆషా



నెహ్రూనగర్ : గుంటూరు నగరపాలక సంస్థ నూతన సీఎంఓహెచ్‌గా ఏలూరు జిల్లా నూజివీడు డెప్యూటీ డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న సివిల్ సర్జన్ డాక్టర్ డి.ఆషాని బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం నగర కమిషనర్ కీర్తి చేకూరిని ఆమె ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలో మెరుగైన పారిశుధ్యం అందించడంలో ప్రజారోగ్య విభాగం మరింత బాధ్యతగా పని చేసేలా కృషి చేయాలని సీఎంఓహెచ్‌కు కమిషనర్ కీర్తి సూచించారు.

సంక్రాంతి సెలవులు పొడిగింపు

ఈనెల 22న పాఠశాలలు పునఃప్రారంభం

గుంటూరు ఎడ్యుకేషన్ : సంక్రాంతి సెలవులను ఈనెల 20వ తేదీ వరకు పొడిగిస్తూ విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు డీఈవో పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలు ఈనెల 22న పాఠశాలలను పునః ప్రారంభించాలని పేర్కొన్నారు. సెలవుల్లో పదో తరగతి సహా విద్యార్థులెవ్వరికీ తరగతులు నిర్వహించేందుకు వీల్లేదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే గుర్తింపు రద్దుతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

పోస్టుల భర్తీకి ఆహ్వానం

గుంటూరు మెడికల్ : గుంటూరు జిల్లాలో ఖాళీగా ఉన్న డాక్టర్లు, డ్రైవర్ల పోస్టుల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ పాతపాటి బాల చంద్రుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ పోస్టులకు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత అవసరం. డ్రైవర్ పోస్టులకు 2-3 సంవత్సరాల అనుభవంతో హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో అనుభవజ్ఞులైన అభ్యర్థులు అవసరం. మరిన్ని వివరాలకు జిల్లా మేనేజర్ బాల చంద్రుడు మొబైల్ నంబర్ 90328 76888లో సంప్రదించాలన్నారు.

తైక్వాండో ముగ్గురికి స్వర్ణం



తెనాలిఅర్బన్: జిల్లాస్థాయి తైక్వాండో పోటీలలో తెనాలిలోని యూనిక్ తైక్వాండో అకాడమీకి చెందిన ఎ.జాహ్నవి, జి.వెంకట శ్రీమంత్, ఎ.చరణ్‌తేజ్‌లకు బంగారు పతకాలు లభించినట్లు కోచ్ బట్టు నాగరాజు తెలిపారు. ఈ నెల 7న మంగళగిరిలో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. అలాగే వీరిని రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జట్టుకు ఎంపిక చేసినట్లు వివరించారు. బుధవారం అకాడమీ ఆవరణలో వీరిని అభినందించి, మెడల్స్, సర్టిఫికెట్‌లు అందజేశారు.

రెవెన్యూ అధికారుల బదిలీలు

గుంటూరు వెస్ట్:గుంటూరు కలెక్టరేట్‌లో ఏఓగా పనిచేస్తున్న ఎం.పూర్ణచంద్రరావును వెంకటాచలం తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. గుంటూరు ఆర్డీవో కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న షేక్ ఇస్మాయిల్ విడవలూరు తహసీల్దార్‌గాను, తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న జి.వెంటకస్వామిని రాపూరుకు, రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న పి.జాన్‌పీటర్‌ను దగదర్తి తహసీల్దార్‌గా, గురజాల ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్.శివనాగిరెడ్డిని ఆత్మకూరు తహసీల్దార్‌గా, బాపట్లలో ఏఓగా పనిచేస్తున్న కె.గోపికృష్ణను చీరాల తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ చీఫ్ కమిషనర్ ఎం.డి.ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

టెన్నిస్ పోటీలకు క్రీడాకారులు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో గురువారం నుంచి జరగనున్న 67వ జాతీయ స్కూల్ గేమ్స్ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు స్థానిక ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు బాల మనోజ్, చరణ్, షేక్ అబ్రాల్ ఎంపికయ్యారని కోచ్ జీవీఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల మనోజ్, చరణ్‌లు అండర్-19, షేక్ అబ్రాల్ అండర్-17 విభాగాల్లో పోటీ పడతారన్నారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులను స్టేడియం టెన్నిస్ సభ్యులతోపాటు రేమండ్స్ అధినేత టి.అరుణ్ కుమార్ అభినందించారన్నారు.

మైనార్టీల అభివృద్ధికి అండ

- సీఎం వైఎస్ జగన్ హయాంలో మైనార్టీలకు ఎంతో మేలు
- నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన మహానేత వైఎస్సార్ బాటలోనే సీఎం వైఎస్ జగన్
- 55 నెలల్లో మైనార్టీల ఖాతాల్లో రూ.26వేల కోట్ల నగదు బదిలీ
- మంత్రి పదవులు, పార్టీ పదవులు, కార్పొరేషన్ల నియామకాలు, స్థానిక సంస్థల్లో పెద్దపీట
- ప్రతిపక్షాల దుష్ప్రచారాలు నమ్మొద్దు
- 'జగన్ పాలన - మైనార్టీల స్పందన'పై రాష్ట్ర ప్రజాస్థాయి సదస్సులో వక్తలు వెల్లడి



నగరంపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు పెద్దపీట వేసినట్లు గణాంకాలు చెబుతున్నాయని ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ వీవీఆర్ కృష్ణంరాజు అన్నారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు తాలుకా పెన్షనర్స్ హాల్‌లో బుధవారం 'జగన్ పాలన – మైనార్టీల స్పందన' పై రాష్ట్రస్థాయి ప్రజా సదస్సు జరిగింది. ఏసీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ పి.ముత్యం సదస్సుకు అధ్యక్షత వహించి మాట్లాడారు.

- ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ పేద వర్గాల్లోని ముస్లింల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ కృషి చేశారని చెప్పారు. మైనార్టీల తరఫున ఒకరికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడం చాలా సంతోషకరమని అన్నారు. రెవ.నవ కుమార్ మాట్లాడుతూ ఇంటి బయట సైకిల్, టేబుల్‌పై గ్లాస్ ఉండాలని, అయితే ఫ్యాన్ గాలి కింద ప్రజలు హాయిగా ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ మాట్లాడుతూ గ్రంథాలయ చరిత్రలో ఎస్సీలను నియమించిన దాఖలాల్లేవని అన్నారు. వైఎస్ జగన్ హయాంలో రాష్ట్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లను నియమించడం శుభపరిణామమని చెప్పారు. పొన్నూరు మసీదు ప్రచార కార్యదర్శి షేక్ అబ్దుల్‌నాజర్ మాట్లాడుతూ గతంలో హజ్‌యాత్రకు వెళ్లాలంటే అనేక ప్రయాసలకు గురికావాలని, ప్రస్తుతం అనేక మౌలిక సౌలభ్యాలను కల్పించారని చెప్పారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కరిముల్లా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మైనార్టీలకు కార్పొరేషన్ల కేటాయింపులో అగ్రతాంబూలం ఇచ్చారని అన్నారు. ఆంధ్రా అడ్వొకేట్స్ ఫోరం కన్వీనర్ బి.అశోక్ కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ హయాంలో అందరూ హాయిగా ఉన్నారన్నారు. న్యాయవాది షేక్ లియాఖత్‌అలీ మాట్లాడుతూ మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ దిక్సూచీగా ఉన్నారని అన్నారు. నలుగురు మైనార్టీల ఎమ్మెల్యేలు ఉంటే అందులో ఒక ఉప ముఖ్యమంత్రి, మండలి వైస్ చైర్మన్‌గా మైనార్టీ మహిళను నియమించారని ఆయన గుర్తు చేశారు. కార్పొరేటర్ బూసి రాజలత మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని అన్నారు. బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మేడిద జాన్సన్, విశ్రాంత తహసీల్దార్ విక్టర్‌పాల్, భాగ్యరావు, పి.సుందరరావు, సత్యనారాయణరెడ్డిలు మాట్లాడారు.

ముస్లింలు సీఎం వైఎస్ జగన్ వెంటే..



జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలీ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం మహానేత వైఎస్సార్ ఒకడుగు వేస్తే సీఎం వైఎస్ జగన్ పది అడుగులేశారని చెప్పారు. ఏపీలో 2,198 మసీదులు ఉన్నాయని, ఒక్కో మసీదులోని మౌజన్, ఇమామ్‌లకు ఏటా రూ.1.98 లక్షలు గౌర వేతనం చెల్లిస్తున్నారని అన్నారు. ఈ 55 నెలల్లో కోట్ల రూపాయలను గౌరవ వేతనంగా అందించిన ఘనత వైఎస్ జగన్‌కే సాధ్యమైందని పేర్కొన్నారు. ఏపీలోని సుమారు రూ.2.20 కోట్ల ముస్లింలు వైఎస్ జగన్ వెంటే ఉన్నారని అన్నారు.

మహానేత వైఎస్సార్ బాటలో సీఎం జగన్..



అంజుమాన్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ మొయినుద్దీన్ మాట్లాడుతూ మహానేత వైఎస్సార్‌పై నమ్మకంతో 2004, 2009 ఎన్నికల్లో ఆయన్ను ముస్లింలు మళ్లీ గెలిపించారని చెప్పారు. అదేస్ఫూర్తితో వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలిచి, గెలిపించారని అన్నారు. 4 శాతం రిజర్వేషన్ అమలుతో ఎందరో వైద్యులు, ఇంజినీర్లు మైనార్టీల ప్రతి ఇంట్లో ఉన్నారని, అందుకు మహానేత వైఎస్సారే కారణమని చెప్పారు. తండ్రి బాటలో వైఎస్ జగన్ వెళ్తున్నారని అన్నారు.

రూ.26వేల కోట్ల నగదు బదిలీ..



ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు మాట్లాడుతూ 55 నెలల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు సుమారు రూ.26 వేల కోట్ల నగదు బదిలీ జరిగిందని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా అసత్య ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాలకు తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

పెత్తందార్లకు బుద్ధి చెప్పాలి..



బెటర్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాలు అధికారంలోకి వస్తే దోచుకోవచ్చు, దాచుకోవచ్చుననే ఆలోచనతో కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అటువంటి పెత్తందార్లకు బుద్ధి చెప్పాలని అన్నారు. పేదలకు అన్ని విధాల అండగా ఉంటున్న సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికి మరోసారి తోడుగా నిలవాలని చెప్పారు. మైనార్టీలతోపాటు అన్ని వర్గాల అభివృద్ధికై నిరంతరం శ్రమించే ఏకైక సీఎం వైఎస్ జగన్ అని చెప్పారు.

పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్య



ఆచార్యులు శరత్ జ్యోత్స్న రాణి మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఇంగ్లిష్ చదవాలనే ఒక ఆశ ఉండేదని అన్నారు. ఆ ఆశను నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు చేశారని చెప్పారు. అందరి గురించి ఆలోచించే మానవత్వం ఉన్న మనిషి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు జిల్లాకే గర్వకారణం

గుంటూరు నగర కమిషనర్‌కు జిల్లా కలెక్టర్ అభినందనలు



గుంటూరు వెస్ట్: గుంటూరు నగరానికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు–2023 రావడం జిల్లాకే గర్వకారణమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరిని, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీఎంసీ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా జాతీయస్థాయిలో అవార్డు వచ్చిందన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న స్వచ్ఛ నగరాల విభాగంలో ఈ అవార్డు వచ్చిందన్నారు.

22న తుది ఓటర్ల జాబితా విడుదల

జిల్లాలోని ఎస్ఎస్ఆర్–2024 డ్రాఫ్ట్ జాబితాకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలను, క్లెయిమ్స్‌ను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిష్కరించామని ఈ నెల 22న ఓటర్ల తుది జాబితా విడుదలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాప్రతినిధుల, అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 12 నాటికి క్లెయిమ్స్ పరిష్కరించి పేర్లను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేశామన్నారు. జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు..

జిల్లాలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి చెప్పారు. కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌లు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు, పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈనెల 27వ తేదీలోపు మౌలిక సదుపాయాల కల్పన పూర్తి చేయాలని తెలిపారు.

ఓటర్ల తుదిజాబితా విడుదలకు చర్యలు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ఓటర్ల తుది జాబితా విడుదలకు యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని ఆయన చాంబర్లో ప్రత్యేక సమావేశం జరిగింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 22వ తేదీన ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు. ఇందుకోసం అన్ని నియోజకవర్గాల నుంచి వచ్చిన 2,06,672 దరఖాస్తులను పరిశీలించామన్నారు. 1,69,644 దరఖాస్తులను విచారించామన్నారు. 30,699 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. మిగిలిన 6,329 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. నూతన ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, సవరణల కొరకు వచ్చిన దరఖాస్తులను అత్యంత పారదర్శకతతో పరిశీలిస్తున్నామన్నారు. ఎలాంటి పొరబాట్లకు తావులేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా సమర్థంగా రూపొందిస్తున్నామన్నారు. నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కొనసాగుతుందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ర్యాంపులు నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం 25 ర్యాంపులు నిర్మించాల్సి ఉందని, త్వరలో పూర్తికానున్నాయని వివరించారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని విచారిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్, వైఎస్సార్ సీపీ నుంచి ఐ.మాల్యాద్రి, బీజేపీ నుంచి రామకృష్ణ, బీఎస్పీ నుంచి కోటేశ్వరరావు, సీపీఎం నుంచి ఎన్.కోటేశ్వరరావు, కాంగ్రెస్ నుంచి డి.రవి, టీడీపీ నుంచి గౌస్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి..

బాపట్ల: జిల్లాలో గణతంత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన హాల్‌లో గణతంత్ర ఉత్సవాలను నిర్వహించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 26వ తేదీన గణతంత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఉదయం 9 గంటలకు బాపట్ల పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో అవసరమైన ఏర్పాట్లు చూడాలని అదనపు ఎస్పీ మహేష్‌కు సూచించారు. అలాగే పోలీస్ పెరేడ్ గ్రౌండ్ మరియు కలెక్టరేట్లో సుందరీకరణ పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జిల్లాలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తెలియజేసే స్టాల్స్, శకటాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు. జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, జిల్లా రెవిన్యూ అధికారి పి.వెంకటరమణ, డీఆర్‌డీఏ పీడీ సి.కృష్ణ, డ్వామా పీడీ అర్జున్‌రావు, గృహ నిర్మాణశాఖ పీడీ ప్రసాద్, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్యశాఖ జేడీ సురేష్, పౌరసరఫరాల శాఖ డీఎస్‌ఓ విలియమ్స్, డీఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కులగణన సర్వే...

బాపట్ల అర్బన్: కుల గణన సర్వే ఈనెల 19 నుంచి 29వ తేదీవరకు సాగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్‌తో కలిసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో బుధవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కుల గణన సర్వే జిల్లాలో సమర్థంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏదేని కారణాలచేత మిగిలిపోయిన కుటుంబాల సర్వే ఫిబ్రవరి 2వ తేదీవరకు సాగుతుందన్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ ప్రక్రియలో జాప్యం ఉండరాదని కలెక్టర్ హెచ్చరించారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం జిల్లాలో జయప్రదం చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ తెలిపారు. సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాలు పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టకు పేర్లు నమోదు చేసుకున్న వారిని సమీకరించి విజయవాడకు సురక్షితంగా పంపే ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని సీఐకు తీవ్రగాయాలు

- ఘటనలో నుజ్జునుజ్జయిన మార్టూరు సీఐ పి.అక్కేశ్వరరావు కారు
- పుట్టపర్తిలో ప్రధాని బందోబస్తు నుంచి తిరిగి వస్తుండగా నాయుడుపేట సమీపంలో ఘటన
- నెల్లూరు అపోలో ఆసుపత్రిలో చికిత్స



ప్రమాదానికి గురైన కారు, ట్రావెల్స్ బస్సు



కారులో ఇరుక్కుని ఉన్న సీఐ అక్కేశ్వరరావు

మార్టూరు: రోడ్డు ప్రమాదంలో బాపట్ల జిల్లా మార్టూరు సీఐ పి.అక్కేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. ఈఘటన మంగళవారం అర్ధరాత్రి తిరుపతి - నాయుడు పేటకు మధ్య జరిగింది. మంగళవారం పుట్టపర్తిలో జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభ బందోబస్తుకు వెళ్లి తిరిగి మార్టూరు వచ్చే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రత్యక్ష సాక్షి, సీఐ కారు డ్రైవర్ షేక్ సర్దార్, మార్టూరు స్టేషన్ సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... సీఐ పి.అక్కేశ్వరరావు పుట్టపర్తిలో బందోబస్తు చూసుకుని అదేరోజు రాత్రి మార్టూరుకు తిరుగు ప్రయాణం అయ్యారు. కారులో సీఐతో పాటు డ్రైవర్ సర్దార్ మాత్రమే ఉన్నారు. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పరిధిలోని గౌర్రవుమిట్ట గ్రామ సమీపంలో రహదారి నిర్మాణం జరుగుతున్న క్రమంలో ఓ మలుపు వద్ద అర్ధరాత్రి 1:30 గంటల ప్రాంతంలో ఎదురుగా వస్తున్న నాగాల్యాండ్ రిజిస్ట్రేషన్ నెంబరుతో ఉన్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, సీఐ కారు బలంగా ఢీకొన్నాయి. సీఐ కారు ముందుభాగం నుజ్జు నుజ్జయి కారు డోరు తెరుచుకోనంతగా తీవ్రంగా ధ్వంసం అయింది. డ్రైవింగ్ సీట్‌లో ఉన్న సర్దార్ చేతికి, మొహం మీద గాజు పెంకు గీసుకుని స్వల్ప గాయాలయ్యాయి. కారు బ్యానెట్ నుంచి ఒక్కసారిగా వెలువడిన మంటలు కారు లోపలికి వ్యాపించి సీఐ అక్కేశ్వరరావు కుడి మోకాలు మంటల దెబ్బకు మాంసం ముద్దగా మారింది. కుడి మోచేతి కింది భాగం విరిగి ఎముక బయటికి వచ్చింది. ఎడమ కాలు తొడ వద్ద నడుము వద్ద రెండు చోట్ల విరిగి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న ఫైర్ ఇంజిన్‌తో వచ్చిన సిబ్బంది కారులోని మంటలను ఆర్పి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. స్థానికుల సాయంతో కారు డోర్‌లను పగలగొట్టి అపస్మారక స్థితిలో ఉన్న సీఐ, డ్రైవర్‌లను వెలుపలకు రప్పించి 108 వాహనంలో నెల్లూరు అపోలోకి తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న మార్టూరు ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి హుటాహుటిన పరిస్థితిని సమీక్షించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్న సీఐ అక్కేశ్వరరావు పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లా గురజాల మండలం చర్లగుడిపాడు గ్రామానికి చెందిన పి.అక్కేశ్వరరావు 3 నెలల క్రితమే మార్టూరు సీఐగా బాధ్యతలు చేపట్టారు.

విశ్వమానవుడు అంబేడ్కర్

- విజయవాడలో ఆవిష్కరించనున్నది విగ్రహం కాదు.. సామాజిక విప్లవం
- రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రజిని

పట్నంబజారు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఒక ప్రాంతానికో, ఒక రాష్ట్రానికో, ఒక దేశానికో పరిమితమైన వ్యక్తి కాదని, విశ్వమానవుడు అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని పేర్కొన్నారు. కొరిటెపాడు ప్రధాన రహదారిలో వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సీపీ ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ ఈ నెల 19న విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవాన్ని విజయంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. జగనన్న ప్రభుత్వం నిర్మించింది విగ్రహం మాత్రమే కాదని.. బడుగు, బలహీనవర్గాల కలలను సాకారం చేసే ఒక గొప్ప కట్టడమని, అంబేడ్కర్ స్మృతివనం ఒక విప్లవమై నిలుస్తుందన్నారు. అంబేడ్కర్ ప్రతిపాదించిన సిద్ధాంతం విశ్వమానవాళికి ఉపయోగపడేదేనని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అణగారిన జాతులకు ఆశాదీపం అంబేడ్కర్ అని కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తికి జగనన్న దేశంలోనే కనివిని ఎరుగని నివాళి అర్పిస్తున్నారని, ఆయన స్ఫూర్తి కొనసాగేలా అద్భుత కార్యక్రమానికి నడుం బిగించారన్నారు.

ముగిసిన కళాపరిషత్ నాటిక పోటీలు

'చీకటి పువ్వు' నాటికకు ప్రథమ బహుమతి



చీకటిపువ్వు నాటికలోని ఓ సన్నివేశం

పర్చూరు (చినగంజాం): సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో గత నాలుగు రోజుల నుంచి కళానికేతన్ కళాపరిషత్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటిక పోటీలు ఆహ్లాదకరమైన వాతావరణంలో మంగళవారం రాత్రి ముగిశాయి. అన్ని నాటికలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. చైతన్య కళాంజలి కరీంనగర్ వారి 'చీకటిపువ్వు' నాటికకు మొదటి బహుమతి లభించింది. పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు తప్పులు చేస్తుంటారు. కానీ చేసిన తప్పులను సరిదిద్దుకొని భవిష్యత్‌లో కొందరు మార్పు చెందుతారు. అలాంటి వారిని దూరం పెట్టకుండా ప్రేమ, మానవత్వంతో దగ్గరకు తీయాలనే ఇతి వృత్తంతో సాగిన ఈ నాటికను న్యాయనిర్ణేతలు ఉత్తమ ప్రథమ నాటికగా నిర్ణయించారు. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా శర్వాణి గ్రామీణ సాంస్కృతిక సేవాసంఘం, శ్రీకాకుళం వారి కొత్త పరిమళం, ఉత్తమ తృతీయ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటికలను ఎంపిక చేశారు. కళాంజలి హైదరాబాద్ వారి రైతే రాజు నాటికకు ఉత్తమ జ్యూరీ అవార్డు లభించింది. బహుమతులు గెలుచుకున్న నాటికలకు వరుసగా రూ.15 వేలు, రూ.10వేలు, రూ.5 వేలు నగదు బహుమతులు అందజేశారు. కమిటీ సభ్యులు బుచ్చయ్య చౌదరి, సీహెచ్ సాయిబాబు, కొల్లా శ్రీనివాసరావు, గోరంట్ల రమేష్‌బాబు, కందిమళ్ల సాంబశివరావు, పాటిబండ్ల ఆనందరావు, నాయుడు గోపి, మల్లాది శివనారాయణ, కొల్లా శివరామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్వేయర్‌పై సర్పంచ్ దాడి
కేసు నమోదు చేసిన పోలీసులు



మేదరమెట్ల: తనపై బొడ్డువానిపాలెం గ్రామ సర్పంచ్ నేరెళ్ల సుబ్బయ్య దాడి చేశారని కొరిశపాడు మండల సర్వేయర్ మహేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. బొడ్డువానిపాలెం రామాలయం సమీపంలో గల స్థలానికి సంబంధించి గత కొన్ని సంవత్సరాలుగా వివాదం నడుస్తోంది. దీనిపై ఒక పక్షానికి చెందిన వారు స్పందనలో అర్జీ ఇవ్వగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల సర్వేయర్ మరో పక్షానికి చెందిన గ్రామ సర్పంచ్‌కు నోటీసులు ఇవ్వడానికి వెళితే ఆయన స్వీకరించలేదు. గురువారం ఉదయం సర్వేయర్ మహేష్ ఆఫీసుకు వెళ్లే సమయంలో సర్పంచ్, అతని సోదరుడు కలిసి వచ్చి కొరిశపాడులోని ఇండియన్ గ్యాస్ కంపెనీ సమీపంలో దాడి చేశారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

జనన ధ్రువీకరణకు ఆధార్ ప్రామాణికం కాదు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధార్ కార్డులో పుట్టిన తేదీని పౌరుల జనన ధ్రువీకరణకు ప్రామాణికంగా పరిగణించబోమని ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కమిషనర్ ఇంద్ర నీల్ ఘోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) తాము జారీ చేసిన ఆధార్ కార్డులోని పుట్టిన తేదీ సంబంధిత పౌరుల జనన ధ్రువీకరణకు ప్రామాణికం కాదని స్పష్టం చేసిన దృష్ట్యా, ఈపీఎఫ్ఓ పుట్టిన తేదీ సవరణకు చెల్లుబాటయ్యే పత్రాల జాబితా నుంచి ఆధార్‌ను తొలగించినట్లు వివరించారు. యూఐడీఏఐ ఉత్తర్వులకు అనుగుణంగా ఈపీఎఫ్ఓ జారీ చేసిన డిక్లరేషన్ ఆధారంగా భవిష్యనిధి సభ్యుల పుట్టిన తేదీ దిద్దుబాటు కోసం ఆమోదయోగ్యమైన పత్రాల జాబితా నుంచి ఆధార్‌ను తొలగించినట్లు తెలిపారు. ఉద్యోగుల పుట్టిన తేదీని మార్చేందుకు ఆధార్, ఈ-ఆధార్ పత్రాలు చెల్లుబాటు కావని, ఈపీఎఫ్ సభ్యులు, యజమానులు, లబ్ధిదారులు గమనించాలని సూచించారు. ఇకపై పుట్టిన తేదీ రుజువు కోసం ఆధార్‌ను సమర్పించేందుకు అవకాశం లేదని, ఇతర మార్పులకు సంబంధించిన పత్రంగానే ఆధార్ పరిగణించబడుతుందని పేర్కొన్నారు.

యువత సమాజ శ్రేయస్సును కోరుకోవాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, తదితరులు

గుంటూరు మెడికల్: భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ విజయవాడలో శుక్రవారం జరుగనున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సామాజిక సమతా సంకల్పం అనే నినాదంతో స్థానిక గుంటూరులోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరం డీఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి ప్రారంభించారు. డాక్టర్ కె. విజయలక్ష్మి మాట్లాడుతూ యువత సమాజ శ్రేయస్సు కోరుతూ రక్త దానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. రక్తదాన శిబిరంలో జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డాక్టర్ పి.అనూష, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగస్తులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శిబిరంలో గత కొన్ని సంవత్సరాలుగా క్రమం తప్పకుండా రక్తం అవసరమైన వారికి ఎన్నోసార్లు ఆదుకుంటూ 97వ సారి రక్త దానం చేయుటకు ముందుకొచ్చిన గుంటూరుకు చెందిన ఉమామహేశ్వరరావు, మంగళగిరి ఇందిరా నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు చెందిన వైద్యాధికారి డాక్టర్ పి.అనూష అంకితభావంతో వైద్య సేవలు అందజేస్తూ రక్త దానం చేయటానికి ముందుకొచ్చిన ఇరువురిని అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ రాజు, జాతీయ హెల్త్ మిషన్ డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.వి. సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీదారులపై కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్
- వెదుళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులతో కార్డెన్ సెర్చ్
- స్వాధీనం చేసుకున్న వాటి వివరాలు వెల్లడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటుసారా, బెల్లం ఊట

బాపట్లటౌన్: నాటుసారా తయారుచేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు, సెబ్ అధికారులు సంయుక్తంగా వెదుళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద గ్యాంగ్, చిన్న బేతపూడి, వృక్షనగర్ ప్రాంతాల్లో గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ నాటు సారా, ఇతర అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసే ఉద్దేశంతో కార్డెన్ సెర్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. దాడుల్లో భాగంగా 2,500 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశామన్నారు. 25 లీటర్ల నాటు సారా, 3 కేజీల కరక్కాయలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీటితో పాటు ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారన్నారు. జిల్లాలో ఎవరైనా నాటు సారా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. పరివర్తన 2.0 లో భాగంగా నాటుసారా సంబంధిత కేసుల్లోని ముద్దాయిలను బయటికు తీసుకువచ్చి ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించామన్నారు. అయినప్పటికీ కొంతమంది వ్యక్తులు వారి స్వలాభం కోసం ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే నాటుసారా తయారీ, క్రయ, విక్రయాలకు పాల్పడుతున్నారన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అటువంటి వారిపై పీడీ యాక్ట్ అమలు పరుస్తున్నామని, అవసరమైతే అలాంటి వారిపై జిల్లా బహిష్కరణకు కూడా వెనుకాడబోమన్నారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడానికి జిల్లాలోని అనుమానిత ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తామన్నారు. ఏదైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ఐ, డయల్ 100, 112 నెంబర్లకు గానీ ఎస్పీ హెల్ప్‌లైన్ నెంబర్ 8333813228కు గానీ కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని వెల్లడించారు.

ఎయిమ్స్‌లో అత్యాధునిక మైక్రోబయాలజీ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎయిమ్స్ డైరెక్టర్ ముఖేష్ త్రిపాఠి

మంగళగిరి: నగర పరిధిలోని ఆల్ ఇండియా మెడికల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్) అత్యాధునిక ల్యాబ్‌లు ప్రారంభించడం సంతోషంగా ఉందని తద్వారా రోగులకు మరింత మెరుగైన వైద్య పరీక్షలు అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎయిమ్స్ డైరెక్టర్ ముఖేష్ త్రిపాఠి తెలిపారు. గురువారం ఎయిమ్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్లినికల్ మైక్రోబయాలజీ విభాగంలో ఇంటిగ్రేటెడ్ స్టువర్ట్‌షిప్ ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరీక్షా పరికరాలను త్రిపాఠి ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక పరికరాలు రోగులలో బ్యాక్టీరియా, ఫంగస్ క్రిమికీటకాలను అతితక్కువ సమయంలో కనుగొనవచ్చన్నారు. దీని వలన క్లినికల్ బయాలజిస్టులు రోగులకు సరిపడా యాంటిబయాటిక్స్ గురించి తెలియజేయవచ్చన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అత్యాధునిక పరీక్షా పరికరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ డాక్టర్ సుమిత్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన సవరణకు సంబంధించిన 12వ పీఆర్సీ అమలు చేసే ముందుగా 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్లో గురువారం యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షురాలు బి. ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పీఎఫ్ బకాయిలను చెల్లించిన ప్రభుత్వం తక్షణమే ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైతే పాఠశాలల్లో ప్రతి రోజూ అదనంగా అరగంట పని చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కళాధర్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25న ధర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమ కుమారి, జిల్లా గౌరవాధ్యక్షుడు పీవీ శ్రీనివాస్, సహాధ్యక్షులు ఏఎల్ శివపార్వతి, కోశాధికారి ఎండీ గయాసుద్దౌలా, జిల్లా కార్యదర్శి సీహెచ్ ఆదినారాయణ, కె.సాంబశివరావు, జి. వెంకటేశ్వరరావు, ఎం.గోవిందయ్య, టి. ఆంజనేయులు, యు.రాజశేఖర్, జీవీ ధనలక్ష్మి, కె. కేదార్నాథ్, ఏ. శ్రీనివాసరావు, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

నేడు వేమవరంలో ఆరంభం కానున్న పూజా కార్యక్రమాలు

గుంటూరు వెస్ట్: ఫిరంగిపురం మండలం వేమవరంలో ఈ నెల 22వ తేదీన ప్రతిష్ఠితం కానున్న కోటి ఒక్క శివలింగాల దేవాలయ ప్రారంభ పూజా కార్యక్రమాలు శుక్రవారం నుంచి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయుల చేతుల మీదుగా ఆరంభమవుతాయని కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయోధ్య రామ మందిర ప్రారంభ ముహూర్తానికి ఈ దేవాలయం ప్రతిష్ఠిస్తామని వివరించారు. కార్యక్రమానికి జిల్లా నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారని తెలిపారు.

అంబేడ్కర్ జీవితం యువతకు ఆదర్శం

- ఆర్డీవో రవీంద్ర
- సామాజిక సమతా సంకల్పం విజయవంతానికి పిలుపు



మానవహారంగా ఏర్పడిన ఉద్యోగులు, అధికారులు

బాపట్ల: సామాజిక సమతా సంకల్పం వేడుకలను విజయవంతం చేయాలని ఆర్డీవో రవీంద్ర పేర్కొన్నారు. బాపట్లలోని మున్సిపల్ హైస్కూలు నుంచి ఉద్యోగుల ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన చేపట్టారు. మున్సిపల్ హైస్కూలు నుంచి అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని మానవ హారం నిర్వహించారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని రవీంద్ర కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ.భానుప్రతాప్, డీఎంహెచ్‌వో రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

యువతలో నైపుణ్యాల పెంపునకు క్రీడలు దోహదం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- ముప్పాళ్లలో ముగిసిన 32వ రైతుమిత్ర జాతీయ కబడ్డీ పోటీలు



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు:యువతలో నైపుణ్యాల పెంపునకు క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. మండలంలోని ముప్పాళ్లలో 32వ రైతుమిత్ర జాతీయస్థాయి కబడ్డీ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. చివరి రోజు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. ఏటా కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. క్రీడల్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర వంటి కార్యక్రమాలు ఎన్నో చేపడుతున్నారని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 25 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. కర్ణాటక వెంకట్ బీఎంటీసీ జట్టు విజేతగా నిలిచి రూ.2.50లక్షలు బహుమతి గెలుచుకుంది. హరియాణా యూనివర్సిటీ జట్టు ద్వితీయ బహుమతి, మనీష్‌రెడ్డి ఫ్రెండ్స్ సర్కిల్ జట్టు మూడో బహుమతి, హరియాణా జట్టు నాలుగో బహుమతి గెలుపొందింది. 11 స్థానాల వరకు బహుమతులకు ఎంపిక చేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలకు రూ.2.50లక్షల నగదు బహుమతి అందించిన మేఘన ఫుడ్స్ అధినేత బొల్లా రమేష్‌ను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

బాలల హక్కులను మనమే సంరక్షించాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి

పట్నంబజారు: బాలల హక్కులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి చెప్పారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం వీధి బాలలను కాపాడటం, పునరావాసం కల్పించడం అనే అంశంపై పోలీసులు, విద్యాశాఖ, సమగ్ర శిక్షణ, కార్మికశాఖ, సోషల్ వెల్ఫేర్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖ అధికారులు వీధి బాలల హక్కులు కాపాడేందుకు కృషి చేయాలన్నారు. రిపబ్లిక్‌డే సందర్భంగా జనవరి 12 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న వీధి బాలల సంరక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వీధి బాలలు, అనాథలు, యాచకులుగా ఉన్న చిన్నారులను గుర్తించి, వారికి తగిన పునరావాసం కల్పించేందుకు కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సూర్యలంక తీరంలో మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రాణాలు కాపాడిన అవుట్‌పోస్ట్ పోలీసులు

బాపట్లటౌన్: సూర్యలంక సముద్రతీరంలో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం తీరంలో చోటుచేసుకుంది. బాపట్ల పట్టణంలోని ఉప్పరపాలెం గ్రామానికి చెందిన 42 సంవత్సరాల వయస్సు గల మహిళ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, ఆ బాధలను తాళలేక చనిపోవాలనే నిర్ణయానికి వచ్చింది. ఈ క్రమంలో గురువారం ఉదయం సూర్యలంక సముద్ర తీరం వద్ద ఆత్మహత్యకు యత్నించింది. తీరంలో గస్తీ నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పోతురాజు తక్షణమే స్పందించి మహిళను కాపాడారు. మహిళను కాపాడిన అవుట్‌పోస్ట్ సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అభినందించారు.

విదేశీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాపట్ల అర్బన్: ఏపీ రాష్ట్రం నైపుణ్యాభివృద్ధి సంస్థ అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్లాస్టరింగ్ వర్క్, సిరామిక్ వర్క్, బిల్డింగ్ ఫ్రేమ్ వర్క్, ఐరన్ బెండింగ్ వంటి రంగాల్లో ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు గురువారం తెలిపారు. ఉద్యోగాలకు 8 తరగతి, అంతకంటే ఎక్కువ చదివిన వారు, ఇంగ్లీష్‌పై అవగాహనను విద్యార్హతలుగా వెల్లడించారు. వయస్సు 21 నుంచి 45 సంవత్సరాల మధ్యలో ఉండి, మూడు సంవత్సరాలు అనుభవం కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు సంబంధిత వెబ్‌సైట్ల ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 99888 53335, 85559 01198 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ట్రామా కేర్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న క్యాజువాల్టి మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగ నియామకాలకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గురువారం విడుదల చేసినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు లిఖిత పూర్వకంగా తగు ధృవపత్రాలతో జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేయాలన్నారు.







అద్భుతంగా అంబేడ్కర్ స్మృతివనం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, సామగ్రితో నిర్మాణం చేపట్టారు. ఎన్నో చారిత్రక అంశాలు అందరికీ తేలికగా అర్థమయ్యేలా ఏర్పాటుచేసిన చిత్రపటాలు, విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రక్తదానంతో ప్రాణదాతలు కండి

డీఎంహెచ్‌వో విజయమ్మ

బాపట్ల: రక్తదానంతో నిండు ప్రాణాలను బ్రతికించేందుకు అవకాశం ఉందని డీఎంహెచ్‌వో విజయమ్మ పేర్కొన్నారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా బాపట్ల జిల్లాలోని మార్టూరు, రేపల్లె, బాపట్లలో రక్తదాన శిబిరాలను గురువారం ఏర్పాటు చేశారు.100 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అధికారి సీ.వీ.రమాదేవి, డాక్టర్ శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

టీబీ ఉద్యోగాల ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: జిల్లా టీబీ కార్యాలయంలో నేషనల్ టీబీ కంట్రోల్‌లో భాగంగా కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నవారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గురువారం విడుదల చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. ప్రొవిజనల్ మెరిట్‌లిస్టును గుంటూరు ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ప్రొవిజనల్ లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గుంటూరు జీజీహెచ్ ఆవరణంలోని జిల్లా క్షయ నివారణ కేంద్రంలో తగు ధృవపత్రాలతో లిఖిత పూర్వకంగా అందజేయాలన్నారు. ఉద్యోగాలకు అర్హులైన వారిని ప్రతిభ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేస్తున్నామని వెల్లడించారు.